# చేతబడి

(కథానిక)

తెలుగుదేశంలో నాటక కళోద్ధారణకు తన జీవిత సర్వస్వాన్ని త్యాగంచేసి అయినా సరే ప్రజలలో నాటక ప్రదర్శనాల ద్వారా సంస్కారం విజ్ఞానం వినోదం వెదజల్లటానికి కంకణం కట్టుకొన్న నాయుడుగారు చిట్టచివరికి దానితో విసుగెత్తి విశ్రమించారు నాటకరంగాల నుండి. నాయుడుగారు వెనుక ఇంత కలిగి ఉన్నవారు కాబట్టీ సహజమయిన ఆసక్తి ఉన్నవారు కాబట్టీ ఇన్నాళ్ళయినా వాళ్ళలో ఉండగలిగారు. "ఈ నాటకాలు వేసేవారిలో ఒక్కడూ మంచి కారెక్టరు గలవాడు కాడుగదా! నాటకమంటే ఏమిటో తెలియదు. కాని అంతా అప్పుడే బ్రాందీల్లోని సాంప్రదాయాలను గురించి తెలుసుకుంటారు! ప్రతివాడూ ఒక యాక్టరల్లే మాట్లాడవస్తాడు" అని నాయుడుగారు అనేకమారులు అంటుంటారు. వారు ఏమన్నా సరే దాన్ని మనము నిజంక్రింద తీసుకోవలసిందే. ఎందువల్లనంటే వారు వయస్సులో సుమారు ముప్పాతికభాగం నాటకాలలో గడిపినటువంటివారు. నాటకాల ట్రూపులని ఆర్గనైజు చేయటం, ఆడించటం ఈ విధంగా అనేక సంవత్సరాలు తన జీవితయాత్ర చేసి చివరకు విసుగెత్తి నాటకరంగాల నుంచి విరమించారు. విరమించటానికి యింకొక కారణం కూడా లేకపోలేదు. అది వేరే ఏమీ కాదు. నాయుడుగారికి ఉబ్బసంఉండటంవల్ల రెక్కలు ఊడబెరికిన పక్షివలె ఇంటివద్దనే ఉంటూ నాబోటి శ్రద్ధగా వినేవాడుంటే వాళ్ళకు తన జీవిత విశేషాలను చెప్పటం, లేకపోతే తన స్నేహితులని గురించి చెప్పటం, తప్ప వేరే ఇతరమయిన పనులు లేవు. ఉన్న భూమి మగతాకిచ్చి వచ్చిన గింజలు అమ్ముకొని ఏ విషయంలోనూ ఒకళ్ళని అడగకుండా ఇంకా వీలుగా ఉంటే తనే ఇతరులకి సహాయం చేస్తూంటారు.

ఒకరోజున కాలక్షేపానికని కాలువ గట్టుకి వెళ్లాం నేనూ నాయుడుగారూ. పిచ్చాపాటీ మాట్లాడుకొని తిరిగి వస్తూంటే ఒక్కమారుగా జ్ఞాపకం వచ్చింది కాబోలు "మన ఇళ్లదగ్గర టీకొట్టు అయ్యరు తెలుసునటోయ్" అని అడిగారు. టీకొట్టు అయ్యరుకీ నాకూ ముఖపరిచయం ఉన్నది కాని అతనిగురించి నాకు ఎక్కువ తెలియదు. టీకొట్టు అతన్ని గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత నాకు లేకపోయింది? అతన్ని గురించి నన్ను ఏ పరీక్షల్లోనూ అడుగలేదు. పైగా టీకొట్టు అయ్యరునుగురించి తెలుసుకోవటానికి అతని ముఖంమీద ఏవిధంగాను రాసి ఉండలేదు. అతన్ని చూడగానే అతనికో "హిస్టరీ" ఉన్నదని సామాన్యుడు ఎవ్వరూ అనుకోటానికి వీలులేదు. అయ్యరు పొట్టిమనిషి. గుండ్రటి మొఖం. కొద్దిపాటి పొట్ట. బలిష్ఠంగా కనబడే గుండ్రటిచేతులు. పెద్ద నుదురు. బట్టతల. మొఖాన ఎల్లప్పుడూ ఒక విధమయిన సంతోషరేఖలు కనుపిస్తవి. కాని అన్నింటికన్నా విచారించదగ్గ విషయం అయ్యరు కళ్లు చిన్నవిచేసి బిగ్గరగా నవ్వుతూంటే భయంకరంగా ఉంటుంది. నవ్వు ఎప్పుడూ నాలుకచివరనే ఉంటుంది కనుక ఒకొక్కప్పుడు మనిషి తనలో తాను నవ్వుకుంటున్నట్లు, తన మాటలకి తానే సంతోషిస్తున్నట్లుగా మనకు తోస్తుంది.

"నువ్వు అతన్ని కలుసుకోవాలోయ్! ఐతే ఇంతకీ నువ్వు దెయ్యాలని గురించి నమ్ముతావా లేదా?" అని అడిగారు.

నాకు ఎటూ చెప్పటానికి వీలులేదు. అందరికీ మల్లేనే ఫ్యాషన్‌గా దెయ్యాలులేవు దేవుళ్లూ లేరు అని అబద్ధం ఆడటానికి వీలు లేదు. ఎందువల్లనంటే నా అంతట నేను రాత్రి పూట ఏకాంత ప్రదేశాలకి పోవటానికి భయపడుతుంటాను. ఒకవేళ నమ్మటానికి దెయ్యాలు

మొవ్వ రాంబాబు

మన కళ్ళకు ఎన్నడూ కనుపించవు పొరపాటున అయినా.

"నువ్వు దెయ్యాలనీ చేతబళ్ళనీ నమ్మేట్టుగా అయితే అయ్యరుగారు ఒక మంచి అనుభవం చెపుతాడు. అది వారి నోటినుండే వినాలోయ్" అని అనేటప్పటికి నాకు మంచి కుతూహలం కలిగింది. ఎందుకని అంటే కథలు వినటం అంటే సరదా కాకుండా దెయ్యాలు భూతాలు చేతబళ్ళతో కూడుకున్న కథలంటే ఏ పాతాళభైరవినో చూడటమంతని నా అభిప్రాయం.

అయ్యరు ఇల్లు పూరిల్లు. ఐనా చాలా చక్కగా ఉన్నది. చుట్టూ చాలా ఖాళీస్థలం. చిన్నతోట మల్లె ఉన్నది ప్రదేశమంతా. నేనూ నాయుడుగారు పడక కుర్చీలో కూర్చున్నాం. అయ్యరు చిన్న నవ్వారు మంచంమీద కూర్చున్నాడు. ఆరోజు హోటల్‌కి సెలవు ఇచ్చినందువలన అతడు మాకు విశ్రాంతిగా దొరికాడు. ఆయన భార్యకూడా అక్కడే ఉన్నది. మనం అంటే బాగోదు కాని ఎందువల్లో అయ్యరు ఎప్పుడూ తన భార్యమీదనుండి దృష్టి మరల్చడు. ఒక కంట ఆమెవంక చూస్తూ ఒకవంక మనకు సమాధానాలు చెప్పుతుంటాడు. అతని భార్య అంత అందకత్తె అనుకోటానికి వీలులేదు కాని వంక పెడటానికికూడా వీలులేదు. ఆమె చూపులనుబట్టి ఆమెకు అట్టే ఎక్కువ వయస్సు లేదని మనం గ్రహించవచ్చు. మనిషి కొంచెం దళసరి. బిగువైన శరీరం, మంచి తీర్చిన అవయవాలతోనూ ఉన్నందువలన మంచి కష్టించి పనిచేసే ఆమె అని అనుకున్నాను. కొద్ది నిమిషాలు గడిచిన తర్వాత మాకందరికీ కాఫీ తయారు చేయవలసిందని ఆమెకుచెప్పేటప్పటికి ఆమె ఇంట్లోకి వెళ్ళింది.

"నా భార్యకు నేనంటే ఎంత ఇష్టమండీ!" అని అన్నాడు అయ్యరు స్వచ్ఛమైన తెలుగులో గుంటూరు జిల్లావాళ్ళ తెలుగుతో సమానంగా. "మీరంటే అంత ఇష్టమాండీ!" అని అన్నాను. ఆమెను చూడగానే నాకు సాధువుగా, మంచిదిగా అనిపించినమాట వాస్తవమే.

"ఎవరికీ స్వయంగా అనుభవం కలిగితేగాని వాళ్ళు నమ్మరండీ. చూడండీ! మీరు చేతబళ్లు అంటే నమ్మరు. చేతబళ్ళకీ నా భార్య మంచితనానికీ ఏమిటి సంబంధం అంటారో? అది అంతా చెప్పటమంటే నా జీవితంలో సగభాగాన్ని గురించి చెప్పటమన్న మాట" అని ఈ విధంగా నన్ను ఉద్దేశించిచెప్పటం మొదలుపెట్టాడు.

"ఇట్లాగే టీకొట్టు పెట్టుకొని సుఖంగా నేనూ నా భార్యా జీవిస్తున్నాం. ఒక రోజున నా షాపుదగ్గరకు ఒక యువకుడు వచ్చాడు నా దగ్గర పని చేస్తానని. వాడికి నిజంగా అన్ని పనులూ చేతవును హోటల్‌కి సంబంధించినంత వరకు. అట్లా ఒకవారం రోజులు జరిగిపోయాయి. మేమిద్దరం కలసి పనిచేయటంవల్ల నాకు కొంచెం పనినుండి తెరిపి ఇచ్చింది. హోటల్ వ్యాపారం బాగా సాగుతున్నది ముఖ్యంగా వాడు వచ్చినప్పటినుంచి. ఒక రోజున నేను ఇంటికి రాగానే నా భార్య "వాడిని ఇంట్లో నుండి పంపివేయండి. వాడు ఉన్నంత మటుకు నాకు సుఖం ఉండదు" అని అన్నది. నాకు ఏమీ అర్థం కాలేదు. అట్లా చేతికి ఉపయోగపడుతున్నటువంటి వాడిని ఏ విధంగా వదులుకోవటం?

"ఈ తడవ ఇంకా ఏమయినా గోలచేస్తే నాకు చెప్పు. వాడిని చంపి వేస్తాను" అని ఆమెకి నచ్చచెప్పాను. వాడిని పిలిచి అట్లా ఆమెని ఆశించినట్లయితే నిజంగానే చంపివేస్తానని బెదరించాను. వాడు ఏమీ మాట్లాడలేదు. తర్వాత దాదాపు వారం రోజుల వరకూ ఏమీ జరగలేదు. కాని వాడు మాత్రం ఆమెవంక భీకరంగానే చూస్తున్నాడు. నేను ఇదంతా కనిపెడుతూనే ఉన్నాను. అటువంటి పనివాడిని పోగొట్టుకుంటే ఇబ్బందిపడవలసి వస్తుందని నేను చూస్తుండేవాడిని. ఇంతలో ఒకనాడు నాకు కొద్దిగా జ్వరం తగిలినట్లు అనిపించింది. మరుచటి రోజుకల్లా జ్వరం తగ్గిందికాని నీరసంగానే ఉన్నది. ఇదే విధంగా రోజూ నీరసంగానే ఉంటం మొదలుపెట్టింది. రోజులు గడుస్తున్నకొద్దీ మనిషిని తగ్గి శల్యాకారమై పోతున్నాను. జ్వరం మాత్రం రావటంలేదు. మాఆవిడకి భయం వేసింది. నాకు మాత్రం ఇదేముందిలే అనిపించింది. డాక్టర్లకు చూపించాను.

జబ్బు ఏమీ లేదని మాత్రం అందరూ చెపుతారు గాని మనిషినితగ్గటానికి మాత్రం కారణం ఎవ్వరూ చెప్పలేక పోయారు. నేను ఉన్నకొద్దీ చిక్కి శల్యాకారమై పోతున్నాను. నా భార్య ఒక సాయంకాలం ఎవరినో తీసుకొచ్చింది. నేల అంతా అలికించి ముగ్గులు పెట్టించి ఏవేవో చేసి వెళ్ళబోయేముందు మాఆవిడ చెవిలో వాడు ఏమో ఊదాడు. ఆమె ముఖం వివర్ణమయింది. ఒక్కసారి భయంతో కంపించిపోయింది. ఆ మాంత్రికుడు ఇంకొకమాట చెప్పగానే ఆమె మోమునందు కొద్దిగా ఆశారేఖలు పొడచూపినవి. నాకు మాత్రం అంతా అగమ్యగోచరంగా కనిపించింది. నా హోటల్ శుభ్రంగా ఆ యువకుడు నడుపుతున్నాడు. నా ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించిపోతోంది. చివరకు శవాకారంగా తయారవుతున్నాను. ఒకరోజు రాత్రి చూస్తే ఆమె ఇంట్లో లేదు. మరుసటి రోజు ప్రొద్దున్నే వచ్చింది ఇంటికి. ఎక్కడికి పోయావని అడిగాను. కాని మాట్లాడలేదు. మళ్ళా ఆరోజు రాత్రి ఆమె ఎక్కడికో వెళ్ళిపోయింది. ఆమె ఎక్కడకు వెళుతుందో లేచి చూద్దామనుకున్నాను గాని లేచే శక్తి లేకపోయింది. మళ్ళా దాదాపు తెల్లవారగట్ట ఇంటికి వచ్చి గది తలుపులు, కిటికీలు అన్నీ మూసి నన్ను లేపింది.

"ఏమిట"న్నాను.

"వాడిని చంపివేశాను" అని అంది.

"ఎవడిని?"

"మీదగ్గర పని చేయటంలా? వాడిని! నేను చెపుతుంటే మీరు విన్నారు కాదు వాడిని పంపించి వేయమంటె. మిమ్మల్ని చంపివేయాలని, హోటల్ని నన్నుకూడా కాజేయాలని ఎత్తువేసి మీకు చేతబడి చేయించాడు. మీకు అది చెపుతున్నా అర్థం చేసుకోరు. ఎందుకొరకన్నారు మీరు ఈ విధంగా కృశించిపోవటం? మీకు జ్వరం వచ్చిపోయిన తేది లగాయితూ ఇరవై మూడు రోజుల లోపుగా చచ్చిపోతారని వైద్యుడు చెప్పాడు. ఈ లోపుగా వాడు చస్తే మీరు తేరుకుంటారట" అని అంది.

నా చెవులని నేనే నమ్మలేకపోయాను. ఆమెకి ఏమయినా పిచ్చి ఎక్కిందేమో ననుకున్నాను గాని అటువంటి చేష్టలు లేవు. స్వభావమయిన సరళస్వరాలతో పలుకుతోంది. అప్పటికప్పుడే నా శరీరంలో ప్రతి నరనరాన ఒకానొక అద్భుతశక్తి ఉప్పొంగుతున్నట్లు నా ఒంట్లో బలము, శక్తి కాంతి వస్తున్నట్లు అనిపించింది. నెమ్మదిగా లేచి ఆమెని దగ్గరకు తీశాను. ఆమెకు భయమూ, నామీద ప్రేమ, చేసిన పనికి గర్వమూ అన్నీకలిసి అలిసిపోయి నా వక్షస్థలమందు వ్రాలినది" అని అన్నాడు అయ్యరు.

"తర్వాత ఏమయింది?" అడిగాను ఆదుర్దాగా.

"ఏమవుతుంది? చచ్చినవాడి తరపున ఎవ్వరూ మాట్లాడేవాళ్ళు లేరు. ఏమైనా పోలీసు వాళ్ళకి పది రూపాయలు ఇచ్చేవాళ్ళుంటే గాని పోలీసులు శ్రమపడి ఉండరు! వాడి అసలు ఊరు ఏదో తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలియదు. నాదగ్గర ఉంటున్నప్పుడు మారు పేరుతో ఉంటుండేవాడువాడు. అంతటితోనే పోయాడు. మళ్ళా నేను యథాస్థితికి వచ్చాను. దీనిలో మహాత్మ్యం ఏమిటంటారు? వాడు చావంగానే నేను తేరుకున్నాను" అన్నాడు అయ్యరు.

"ఇంతకీ అదిఅంతా మీ అదృష్టం. మీభార్య నిర్మల ప్రేమ యొక్క ఫలితం" అన్నాడు నాయుడుగారు.

ఇంతలో ఆమె మాకందరికీ కాఫీ తెచ్చింది. మేము అంతా కలుపుకు త్రాగుతున్నాం. అంత ప్రేమమూర్తిని శక్తివంతురాలిని తేరిపార చూడకుండా ఉండలేకపోయాను. ఆమెవంకే అనేక మార్లు చూచాను. నేను ఇందాక చూసిన దానికన్నా ద్విగుణీకృతమైన శోభతోను సౌజన్యంతోను ప్రకాశిస్తున్నట్లు అనిపించింది. అయ్యరుగారు అంతా గ్రహించారు. అతను బిగ్గరగా నవ్వుతూ "ఈమె ఆమె కాదండి. ఈమె నా రెండవభార్య" అన్నాడు నవ్వుతూనే.

"అంటే?"

"అంటే ఇంతపనీ చేసి నన్ను కాపాడిన ఆమె మా వంటవాడిని తీసికొని లేచిపోయింది" అన్నాడు ఇంకా బిగ్గరగా నవ్వుతూ.

"చచ్చాం పొండి" అన్నాను ఒక్కమారు అతడి ప్రస్తుత భార్య వంక చూస్తూ.